సాక్షి
కుమురం భీం

మంగళవారం : 11 : జూన్ : 2024



విత్తన ఎంపికే కీలకం

వానాకాలం సాగుకు వరి వంగడాలు సిద్ధంగా ఉన్నాయని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. వివిధ వరి వంగడాల గురించి ఆయన మాటల్లోనే..

8లో▸



మట్టిలోనే విత్తుతున్నారు..!

నేలలో తగినంత తేమ లేకున్నా రైతులు విత్తనాలు విత్తుకుంటున్నారు. అనేకమంది పత్తి చేలను చదును చేసి పొడి మట్టిలోనే విత్తనాలు వేసుకుంటున్నారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /27.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠ్యపుస్తకాల విక్రయాల అనుమతికి దరఖాస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పాఠ్యపుస్తకాల విక్రయాల అనుమతి కోసం ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాల విక్రయానికి అనుభవం, షాప్ వ్యాట్, లైసెన్స్, క్వార్టర్ల రిటర్న్, టర్నోవర్, ట్యాక్స్, ఆడిట్ రిపోర్ట్ వివరాలతోపాటు విద్యాశాఖ పేరుతో రూ.2000 డీడీ చెల్లించి డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2023లో సమ్మె సమయంలో ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందన్నారు. హామీ మేరకు జీవిత బీమా సౌకర్యం కల్పించకపోవడంతో అనేక ప్రాంతాల్లో ట్రాక్టర్, ఇతర ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రతినెలా వేతనాలు విడుదల చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు సంతోష్, శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



ఎంపికైన క్రీడాకారులతో సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సామిల్ల సంపత్‌కుమార్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలో ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులను రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. సోమవారం గోలేటిలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో చెస్‌ను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నెల రోజుల ఉచిత శిక్షణ పూర్తి కాగానే జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. కాగా.. రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్‌కు అండర్– 13 విభాగంలో డి.జాన్సన్, బి.భార్గవ్, పి.మేఘన, ఎం.కృషిక, ఈ.కౌశిక్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్ పోటీలో జిల్లా తరుపున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నల్లబ్యాడ్జీలతో డ్రైవర్లు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ డిపో పరిధిలో పని చేస్తున్న ప్రైవేట్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హైర్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించని పక్షంలో జూన్ 14 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. డ్రైవర్లకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి హైర్‌బస్ డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్మికులకు సైతం వేతనాలు పెంచి బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, నాయకులు మధుసూదన్, భాస్కర్, సాయికృష్ణ, విజయ్, సంతోష్, తిరుపతి, షకీర్, రషీద్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి దూరం!



- జిల్లాలో ముగిసిన వరి ధాన్యం కొనుగోళ్లు
- టార్గెట్ 46,800 టన్నులు..
- సేకరణ 11,745 మెట్రిక్ టన్నులు మాత్రమే
- తరుగు, నాణ్యత పేరుతో తప్పని 'కోతలు'
- ప్రైవేట్‌లో విక్రయానికే అన్నదాతల ఆసక్తి

ప్రైవేటుకే అధికంగా ధాన్యం

యాసంగిలో పండిన ధాన్యంలో అధిక శాతం ధాన్యం జిల్లా రైతులు ప్రైవేటు వ్యక్తులకే విక్రయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న నిబంధనలు, ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న జాప్యం, రైస్‌మిల్లుల వద్ద అడ్డగోలు కోతలను చూసి విసుగుపోయిన రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు ఆసక్తి చూపారు. వ్యాపారులు కొనుగోళ్లలో ఎలాంటి నిబంధనలు విధించకపోవడం, తేమశాతంతో పని లేకుండానే కోత కోసిన వెంటనే ధాన్యాన్ని తూకం వేసి తరలించడంతో పచ్చిధాన్యాన్నే అమ్ముకున్నారు. కోతల ప్రారంభంలో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే అధికంగా ధర చెల్లించడంతో సన్నాలు మొత్తం ప్రైవేటు వ్యాపారుల వద్దకే చేరింది. సీజన్ ముగింపు సమయం వచ్చేసరికి సన్నరకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.1850, దొడ్డురకం ధాన్యానికి రూ.1700 చెల్లించి ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి.

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం చేరుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం తూకం వేయకపోవడం, తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించడంలో జాప్యం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అకాల వర్షాలతో ధాన్యం కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. తేమశాతం, తరుగు, తప్ప, తాలు పేరుతో భారీగా కోతలు విధించారు. ఒక్క కిలో కూడా కోత ఉండదని ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రకటనలు అమలుకు నోచుకోలేదు. రైస్‌మిల్లుల యజమానుల ఒత్తిళ్లకు తలొగ్గి ధాన్యంలో కోతలు విధిస్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరించారు. దీంతో అన్నదాతలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి చూపలేదు. ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకోవడంతో ధాన్యం సేకరణ లక్ష్యానికి అధికారులు చాలా దూరంలో ఉండిపోయారు.

11,745 మెట్రిక్ టన్నుల సేకరణ

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ఏప్రిల్ 1న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. జిల్లాలో ప్రధానంగా దహెగాం, బెజ్జూర్, కౌటాల, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లో యాసంగి వరి సాగు ఉంది. అధికారులు ఈ సారి 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. యాసంగిలో సుమారు 18వేల ఎకరాల వరకు వరి సాగైంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 46,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. అయితే కేంద్రాలను ప్రారంభించడంలో చూపిన ఉత్సాహాన్ని వారు కొనుగోళ్లలో చూపించలేకపోయారు. పలు మండలాల్లో కొనుగోళ్ల కోసం రైతులు ఆందోళనలు సైతం చేపట్టారు. జిల్లాలో కాస్త ఆలస్యంగా వరికోతలు ప్రారంభమైనా.. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని సకాలంలో తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. జిల్లాలో 46,800 టన్నుల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు కేవలం 11,745 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు.

తప్పని కోతలు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరుతో కోత విధించొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా కోతలు మాత్రం తప్పలేదు. అకాల వర్షాలతో చాలామంది ధాన్యం తడిసి ముద్దయింది. దీనికితోడు భూమిలో తేమ కారణంగా అరబోసిన ధాన్యం కింది భాగం కొంత తేమగా ఉండడం సహజం. దాన్నే సాకుగా చూపిన రైస్‌మిల్లుల యజమానులు భారీగా కోతలు పెట్టారు. రైస్‌మిల్లుల యజమానులు తూకంలో తేడాల పేరుతోనూ కోతలు విధించారు. ఈసారి క్వింటాల్‌కు కనిష్టంగా 2.5 కిలోల నుంచి గరిష్టంగా 10 కిలోల వరకు కోత విధించడం గమనార్హం. దీంతో రైతులు పెద్దమొత్తంలో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ధాన్యంలో కోతలకు అంగీకరించని రైతుల ధాన్యాన్ని మిల్లులో దింపుకొనేందుకు మిల్లుల యజమానులు ససేమిరా అనడంతో రైతులకు వేరే దారి లేకుండాపోయింది. మిల్లుల యజమానులతో మాట్లాడుకుని కోత కొంతమేర తగ్గించాలని వేడుకోవడం అన్నదాతల వంతు అయింది.

కొనుగోళ్లు పూర్తి చేశాం

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసింది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు జిల్లాలో 11,745 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. యాసంగిలో జిల్లా రైతులు సన్నరకం ధాన్యాన్ని సాగు చేయడంతో అధిక శాతం మంది ప్రైవేటుగా విక్రయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ కాస్త తగ్గింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ధాన్యం నగదు సైతం అందజేస్తున్నాం.

– రబ్బానీ, డీసీవోఏ

నేడు వానాకాలం సాగుపై ఫోన్ ఇన్



రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆసిఫాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. జిల్లాలోని రైతాంగం ఏ సమయంలో విత్తనాలు విత్తుకోవాలి. పత్తి, సోయా, కంది వంటి పంటల సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులను ఏ మేరకు వినియోగించాలి. నకిలీ విత్తనాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై 'సాక్షి' ఈ నెల 11న మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావుతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. జిల్లాలోని రైతులు జిల్లా వ్యవసాయాధికారిని ఫోన్‌లో సంప్రదించి, తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

రైతులు సంప్రదించాల్సిన నంబర్ : 72888 94022
సమయం: మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు

అటవీ అనుమతుల మంజూరుకు సిద్ధం



మాట్లాడుతున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే దరఖాస్తులు సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న 24 రహదారులు, వివిధ టవర్ల నిర్మాణంపై జిల్లా కేంద్రంలో సోమవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు, భవనాల శాఖలో 12 అనుమతులు రావాల్సి ఉండగా.. వీటిలో 11 కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్ ఉన్నాయని, మరొకటి రాష్ట్ర కార్యాలయంలో పెండింగ్ ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ విభాగంలో ఏడు రోడ్లకు ఐదు కాంట్రాక్టర్ వద్ద, రెండు రహదారుల అనుమతులు మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఐదు రోడ్లు కాంట్రాక్టర్ వద్ద, రెండు రహదారుల అనుమతులు మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అలాగే జియో టవర్ల నిర్మాణంలో భాగంగా ఆరింటిలో ఐదు కాంట్రాక్టర్ వద్ద, ఒకటి తన వద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ టవర్లకు సంబంధించినవి ఏడింటిలో నాలుగు కాంట్రాక్టర్ వద్ద, రెండు మంత్రిత్వ శాఖ, ఒకటి జిల్లా కార్యాలయంలో పెండింగ్ ఉందని తెలిపారు. టెండర్ ప్రారంభ ప్రక్రియలోనే అటవీశాఖ అనుమతి తీసుకుని పనులు ప్రారంభిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. వివిధ శాఖల నుంచి వచ్చే ప్రతిపాదనలకు అనుమతులు వచ్చేలా రాష్ట్ర కార్యాలయంలో సంప్రదిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనుమతులు త్వరగా మంజూరు చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో రేంజ్ అధికారి అప్పలకొండ, రహదారులు భవనాల శాఖ ఈఈ పెద్దన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి ఇందురావు మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శంగా నిర్వహించాలన్నారు. కేజీబీవీ ఉద్యోగుల రెన్యూవల్స్ సైతం సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే, నాయకులు రమేశ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్: రానున్న వర్షాకాలంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లాస్థాయి అధికారులతో వరదలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విషజ్వరాల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యం, రక్షణ అంశాలపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి.. డీపీవో భిక్షపతి, డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్‌డీవో సురేందర్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతితో కలిసి వీసీలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాలంలో తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వివరించారు. వర్షాల ప్రారంభానికి ముందే పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. మురుగు కాల్వల పూడికతీత పనులు, నివాసప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దోమల మందు పిచికారీ చేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బందితో సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని ధర్నా



డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆదివాసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్ మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు లోబడి పని చేయాల్సిన అధికారులు గిరిజనేతరులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చట్టానికి విరుద్ధంగా పని చేస్తున్న వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌వో లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం శేకు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి భగవంత్‌రావు, ఆదివాసీ మహిళా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షురాలు గోడం జంగుబాయి, జిల్లా కార్యదర్శి మారుతి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- ఎన్నికల కోడ్ అనంతరం పునఃప్రారంభం
- వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ దాసరి వేణు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్: సుదీర్ఘ కాలం తర్వాత ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెబ్బెన మండలం రాజారాం గ్రామానికి చెందిన గజ్జెల్లి సత్తమ్మ మూడెకరాల భూమికి పట్టా పాస్‌బుక్ జారీ చేయాలని దరఖాస్తు చేసుకుంది. కాగజ్‌నగర్ పట్టణంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఏదైనా ఉద్యోగావకాశం కల్పించాలని నజ్రూల్‌నగర్‌కు చెందిన మధు వినతిపత్రం అందించాడు. అటవీహక్కు పత్రాలు ఉన్నా రైతుబంధు రావడం లేదని, సమస్య పరిష్కరించాలని జైనూర్ మండలం భూసిమెట్ట గ్రామానికి చెందిన బొల్లక్ ద్రుపదాబాయి విన్నవించింది. పట్టా భూమి ఎనిమిదెకరాల్లో మూడెకరాలు మాత్రమే సాగు చేసుకుంటున్నానని, కొలతలు తీసి మిగిలిన ఐదెకరాలు ఇప్పించాలని కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన ఎల్ములే దశరథ్ దరఖాస్తు చేసుకున్నాడు. కస్తూరిబా గాంధీ విద్యాలయంలో వంటమనిషికి బదులుగా స్వీపర్‌గా పని కల్పించాలని సిర్పూర్(యు) మండలం కోహినూర్‌కు చెందిన ఆత్రం శకుంతల అర్జీ సమర్పించింది. ఆరు సంవత్సరాలుగా అటవీశాఖ నుంచి రావాల్సిన బీడీ కమీషన్ ఇప్పించాలని బెజ్జూర్ మండలానికి చెందిన తులసీరాం విన్నవించాడు. 2012 డీఎస్సీలో ఎంపికైన తనకు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి ఉద్యోగం ఇప్పించాలని జైనూర్ మండలం ఆశాపెల్లికి చెందిన రాథోడ్ గుణవంత్‌రావు దరఖాస్తు చేసుకున్నాడు. సాగు భూమికి తన పేరుతో పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని బెజ్జూర్ మండలం పాపన్‌పేటకు చెందిన బుజాడి లక్ష్మి దరఖాస్తు చేసుకుంది. సోదరుడి పేరుతో ఉన్న భూమిలో తన వాటా భూమి ఇప్పించాలని కెరమెరి మండలం కొలాం కొటారికి చెందిన మడావి భీము కోరాడు. దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని బెజ్జూర్ మండలం తుమ్మలగూడ గ్రామానికి చెందిన జాడి శంకర్ దరఖాస్తు చేసకున్నాడు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఆర్డీవో కాశబోయిన సురేశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకుంటున్నరు



మా తాతముత్తాల నుంచి బెజ్జూర్ మండలం బ్రాహ్మణ్‌పల్లిలో సర్వే నం.59/1/ 1లో 1.370 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నాం. మా పేరుతో పాస్ పుస్తకాలు ఉండగా.. రైతుబంధు కూడా వస్తుంది. కొంతమంది భూమి తమదంటూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– వెంకటేశ్, రైతు, బెజ్జూర్

కొత్త పాస్‌బుక్ ఇప్పించాలి



ఆసిఫాబాద్ మండలం గొడవెల్లి శివారులో సర్వే నం.34.35లో 9.30 ఎకరాల పట్టా భూమి ఉంది. తాతల నుంచి సాగు చేసుకుంటున్నం. పాత పట్టా పాస్‌పుస్తకం కూడా ఉంది. కొత్త పట్టా పాస్‌పుస్తకం ఇప్పించాలి.

– ఒరుగంటి పార్వతి, ఆసిఫాబాద్

పోడు భూములకు పట్టాలివ్వాలి



'కొన్ని సంవత్సరాలుగా కెరమెరి మండలం ధనోర గ్రామంలో 15 మంది రైతులం సుమారు 30 ఎకరాల అటవీ భూమిని సాగు చేసుకుంటున్నాం. 1బీ కూడా ఉంది. కొత్త పట్టా పాస్‌పుస్తకం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.. అధికారులు స్పందించి కొత్త పాస్‌పుస్తకాలు ఇప్పించాలి..' అని ధనోర గ్రామానికి చెందిన సిడాం రవి, కొడప తుకారాం, ఆత్రం లేతు అర్జీ సమర్పించారు.

క్లుప్తంగా

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

తిర్యాణి(ఆసిఫాబాద్): జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన తిర్యాణి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణికి చెందిన కూన చిన్నపోషయ్య (58) 20 ఏళ్ల నుంచి మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆయన తరచూ పక్షవాతం బారిన పడుతుండేవాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు చికిత్స అందించినా ఆరోగ్యం కుదుటపడలేదు. మనస్తాపంతో చిన్నపోషయ్య మద్యానికి బానిసగా మారాడు. మూడు రోజుల క్రితం తిర్యాణి మండల కేంద్రంలోని సోదరుల ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్తున్నాని చెప్పి బయటికి వెళ్లాడు. ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టు కుడి కాల్వ సమీపంలోని టేకు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

టీకానపల్లిలో మరొకరు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామానికి చెందిన దాసరి సత్తయ్య(45) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి సత్తయ్య మద్యానికి బానిసై ఏడాదిగా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో అతడి భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఇంట్లో ఉంటూ ఇటీవల మానసికంగా కుంగిపోయాడు. ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం తన ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు దాసరి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జన్నారం: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి సోమవారం అప్పగించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. మండలంలోని పొనకల్‌కు చెందిన మనోహర్‌రావు ఫోన్ జేబులో నుంచి గత నెల 14న పడిపోయిందని తెలిపారు. సైబర్ క్రైం ఇంచార్జి పీసీ రవీందర్ ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ కనుక్కుని సోమవారం మనోహర్ రావుకు అందజేశామని తెలిపారు.

ఎన్‌హెచ్‌-63 నిర్మాణంతో రైతులకు నష్టం

పాతమంచిర్యాల: నేషనల్ హైవే-63 నిర్మాణంతో లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు అన్నారు. ఎన్‌హెచ్‌-63 నిర్మాణంలో ఉన్న లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తులా మధుసూదన్, రైతులు లగిశెట్టి రాజమౌళి, బొలిశెట్టి తిరుపతి, బోస్, పెట్టెం తిరుపతి, శేఖర్ రెడ్డి, గోళ్ల తిరుపతి, తోట లక్ష్మణ్, చల్ల వెంకటేష్, నైనాల తిరుపతి, నాగిరెగడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు.. విత్తన ఎంపికే కీలకం

- అందుబాటులో అనువైన వంగడాలు
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ



కోట శివకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే బెల్లంపల్లి



సాగుచేసిన తెలంగాణ సోన వరి వంగడం (ఫైల్)

బెల్లంపల్లి: సాగుకు అనువైన వరి వంగడాలు రైతాంగానికి అందుబాటులో ఉన్నాయి. తెగుళ్లు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే సన్న, దొడ్డు రకాలు సాగు చేసుకోవాలి. తద్వారా ఆశించిన మేరకు ఫలితం ఉంటుంది. పంటను సకాలంలో విత్తుకోవడం వల్ల చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఆలస్యంగా విత్తుకోవడం శ్రేయస్కరం కాదు. అదును దాటిపోయిన తర్వాత నాట్లు వేసుకోవడం వల్ల పంటసాగులో అనేక అవరోధాలు ఎదురవుతాయి. ప్రస్తుత వానాకాలంలో సాగు చేయడానికి పలు రకాల వరి వంగడాలు సిద్ధంగా ఉన్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. ఆయా రకాల వరి వంగడాలు, తెగుళ్లను తట్టుకునే గుణం, పంట దిగుబడి తదితర అంశాలు ఆయన మాటల్లోనే..

సన్న గింజ రకాలు

తెలంగాణ సోన(ఆర్.ఎస్.ఆర్ 15048): వానాకాలానికి, యాసంగికి ఎంతో అనువైన రకం. ఈ రకాన్ని సాగు చేయడం వల్ల ఎకరాకు గరిష్టంగా 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జూలై మొదటి వారం నుంచి పంటను విత్తుకోవాలి. ముందుగా విత్తుకోవడం వల్ల పంట కాలం పెరుగుతుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. పొట్టకుళ్లు తెగులును కొంతవరకు నిలువరిస్తుంది.

జగిత్యాల వరి-3(జేజీఎల్ 27356): వానాకాలం, యాసంగికాలంలోనూ విత్తుకోవచ్చు. పంటసాగుకు అనువైన రకం. ఎకరానికి గరిష్టంగా 28 క్వింటాళ్ల దిగుబడిని సాధించవచ్చు. మెడ విరుపు, పొట్టకుళ్ల తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. అన్నం రుచిగా, మంచి నాణ్యత కలిగి ఉంటుంది.

రాజేంద్రనగర్ వరి-3(ఆర్ఎస్ఆర్ 15459): ఈ రకం వరి వానాకాలానికి అనుకూలమైంది. ఎకరానికి గరిష్టంగా 18 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఆకు అగ్గి తెగులు, వరి ఈగ పురుగును మధ్యస్థంగా తట్టుకుంటుంది. సంప్రదాయ చిట్టి ముత్యాలు రకంతో పోల్చినప్పుడు చేను పడిపోయే అవకాశం తక్కువ.

సోమ్నాథ్(డబ్ల్యూజీయల్.347): వానాకాలం పంటగా సాగు చేయడానికి అనువైన వంగడం. ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. ఉల్లికోడు(బయోటైప్ 1అండ్5) తట్టుకునే శక్తి ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు జయిస్తుంది. నారుమడి దశలో కొంతవరకు చలిని తట్టుకునే గుణం ఉంటుంది.

రాజేంద్ర నగర్ వరి-4(ఆర్.ఎస్.ఆర్.21278): ఈ వంగడం వానాకాలం, యాసంగి రెండు కాలాల్లోనూ సాగు చేయవచ్చు. ఎకరాకు పంట దిగుబడి 26 క్వింటాళ్ల వరకు వస్తుంది. అగ్గి తెగులును మధ్యస్థంగా తట్టుకుంటుంది. ఈ వంగడం పొట్టిరకం. పెనుగాలులు వీచినా కింద పడిపోదు.

కూనారం రైస్-1(కే.ఎస్.యమ్.733): వానాకాలానికి, యాసంగికి అనువైన వంగడం. ఈ రకం సాగు చేయడం వల్ల ఎకరాకు గరిష్టంగా 29-30 క్వింటాళ్ల పంట దిగుబడి సాధించవచ్చు. ఈ రకం కొంతమేర అగ్గి తెగులు నివారణకు తోడ్పడుతుంది. నారుమడిలో చలిని తట్టుకునే గుణం ఉంటుంది. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

రాజేంద్రనగర్ వరి-2(ఆర్.ఎస్.ఆర్.15435): వానాకాలం సాగుకు అనువైన పంట రకం. ఎకరాకు 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ రకం ఎంతో సువాసన ఇస్తుంది. పొడువు గింజరకం. అగ్గితెగులు, ఆకుమచ్చ తెగుళ్లను కొంతవరకు నివారించగల శక్తి ఉంటుంది. అన్నం నాణ్యతగా ఉంటుంది.

కంపాసాగర్ వరి-1(కేపీఎస్.2874): ఈ రకం వంగడాన్ని వానాకాలంలో సాగు చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ఎకరాకు 29-30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి సాధించవచ్చు. సుడిదోమ, అగ్గి తెగులును తట్టుకుంటుంది. చౌడు నేలలకు అనుకూలమైంది. 7-10 రోజుల వరకు విత్తన నిద్రావస్థ ఉంటుంది.

కూనారం వరి-2(కే.ఎస్.యమ్.1638): వానాకాలం, యాసంగిలో ఈ రకాన్ని సాగు చేయడానికి అనుకూలమైంది. ఎకరాకు గరిష్టంగా 30-34 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. ఉల్లికోడు(బయోటైప్ 3), అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుని నిలబడుతుంది. అన్నం రుచిగా, నాణ్యత కలిగి ఉంటుంది.

వరంగల్ వరి-2(డబ్ల్యూ.జీ.ఎల్.962): వానాకాలానికి, యాసంగికి అనువైన రకం. ఎకరాకు 26 నుంచి 30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. అన్నం నాణ్యత సాంబ మసూరిని పోలి ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకునే గుణాన్ని కలిగి ఉంటుంది.

దొడ్డు గింజ రకాలు

బతుకమ్మ(జే.జీ.ఎల్.18047): ఈ రకం వంగడం వానాకాలానికి ఎంతో అనువైంది. ఎకరాకు 25-30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ, పచ్చదోమను కొంతవరకు తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. చలిని తట్టుకుని నిలబడుతుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది. గింజరాలే గుణం యంటీయూ 1010 రకం కంటే తక్కువ.

జగిత్యాల రైస్-1(జేజీఎల్.24423): వానాకాలానికి, యాసంగికి అనువైన రకం. ఎకరాకు గరిష్టంగా 35 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. ఉల్లికోడు(బయోటైప్ 1, 3, 5)ను తట్టుకునే శక్తిని కలిగి ఉంటుంది. సుడిదోమ, గోధుమ రంగు, ఆకుపచ్చ తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. అగ్గితెగులును ఎక్కువగా ఆశిస్తుంది. గింజరాలే గుణం తక్కువ. చేను నేలపై పడిపోదు. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

వరంగల్ రైస్-1(డబ్ల్యూజీఎల్ 915): వానాకాలానికి అనువైన రకం. ఎకరాకు 30-35 క్వింటాళ్ల పంట దిగుబడిని సాధించవచ్చు. సుడి దోమ, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, అగ్గి తెగులు, ట్రుంగో వైరస్ తెగుళ్లను కొంతవరకు తట్టుకునే గుణం ఉంటుంది. డ్రమ్‌సీడర్/దమ్ములో నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగుకు అనుకూలం.

తెలంగాణ వరి-1(డబ్ల్యూజీఎల్ 789): వానాకాలానికి అనువైన రకం. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. అగ్గి తెగులును కొంతమేర నివారిస్తుంది. గింజరాలే గుణం తక్కువ. చేను నేలపై పడి పోదు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జన్నారం: ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 9న రాత్రి లక్సెట్టిపేట వైపు నుంచి కవ్వాల్ టైగర్ ప్రాంతంలో నుంచి ఉట్నూర్ వైపు వెళ్తుండగా తపాలపూర్ చెక్‌పోస్టు వద్ద రేంజ్ అధికారి సుష్మారావు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. టిప్పర్‌కు రూ.15 వేలు జరిమానా విధించి, ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. యజమానిని హెచ్చరించి వదిలేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను బహిరంగ వేలం వేస్తామని పేర్కొన్నారు.

రామాలయంలో చోరీ

మంచిర్యాలక్రైం: రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయంలో చోరీ జరిగింది. ఆలయ పూజారి సోమవారం రోజువారీగా పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లాడు. అమ్మవారి విగ్రహాన్ని పరిశీలించి చూడగా మెడలోని సుమారు రూ.10వేల విలువైన బంగారు పుస్తెలు కనిపించలేదు. పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గల్లంతైన వ్యక్తి మృతి

జైపూర్: బంధువుల దహన సంస్కారాలకు వెళ్లొస్తూ ఇంటికి త్వరగా చేరుకోవాలన్న హడావుడిలో గోదావరి నది దాటుతుండగా శివ్వారం గ్రామానికి చెందిన బైరి మధుగౌడ్(58) ఆదివారం సాయంత్రం గల్లంతు కాగా సోమవారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. శివ్వారంకు చెందిన మధుగౌడ్ మంథని మండలంలోని కమాన్‌పూర్‌లో తన బంధువులు మృతి చెందగా కుటుంబ సభ్యులతో కలిసి దహన సంస్కారాలకు హాజరయ్యాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కుటుంబ సభ్యులను పార్వతిబ్యారేజీ మీదుగా ఆటోలో పంపించి మధుగౌడ్ మంథని సైడ్ నుంచి శివ్వారానికి త్వరగా చేరుకోవడానికి గోదావరి నది దాటి వస్తానని చెప్పి వెళ్లాడు. నదిలో నాలుగు రోజుల క్రితం నుంచి నీటిమట్టం పెరగడాన్ని గమనించకుండా దాటుతుండగా గల్లంతయ్యాడు. రాత్రి వరకు మధుగౌడ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా సోమవారం ఉదయం గోదావరి నదిలో మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమదు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



నిందితుడు, పత్తివిత్తనాలతో టాస్క్‌ఫోర్స్ సీఐ

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.3.20 లక్షల విలువైన 107 కిలోల నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలు పట్టుకున్నారు. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజీవ్, ఎస్సై ఉపేందర్, పోలీస్‌స్టేషన్ ఎస్సై రాములు, వ్యవసాయ శాఖ అధికారి మార్క్‌గ్లాడ్ స్టన్ ఆవిడం రోడ్డు వద్ద కాపు కాసి ఉన్నారు. ఓ వ్యక్తి బస్సు దిగి ఆటో కోసం ఎదురుచూస్తూ అనుమానాస్పదంగా సంచులతో కనిపించాడు. తనిఖీ చేయగా పత్తి విత్తనాలు లభించాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయవారి పాలెం గ్రామానికి చెందిన చుండు నాగేశ్వర్‌రావుగా గుర్తించారు. కర్నూలు జిల్లా నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకు వచ్చి గ్రామాల్లో రైతులకు విక్రయిస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోడు భూములపై చర్చలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామ శివారులోని పోడు భూముల సమస్యపై సోమవారం ఆర్డీవో సురేశ్ చర్చలు జరిపారు. భూములకు పట్టాలు ఉన్నాయని, అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు రైతులు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి విన్నవించారు. దీంతో ఆర్డీవో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో చర్చలు జరిపారు. పూర్తి రికార్డులు పరిశీలించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్, డీఎస్పీ కరుణాకర్, ఎఫ్ఆర్వో రమాదేవి, కాగజ్‌నగర్‌రూరల్ సీఐ రాంబాబులు రికార్డులు పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ మాట్లాడుతూ.. పోడు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరిగితే పోరాటం చేస్తామన్నారు.

పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన



పురుగు మందు డబ్బాతో వచ్చిన రైతు జనార్దన్

నెన్నెల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన రైతు రామడుగు జనార్దన్ పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఐకేపీ ఆధ్వర్యంలో చిత్తాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రెండు దఫాలుగా జనార్దన్ ఐదు టన్నుల మామిడికాయలు విక్రయించాడు. బంగెనపల్లి రకానికి కిలోకు రూ.35 చొప్పున ఇవ్వాల్సి ఉండగా కోత విధించారు. కిలోకు రూ.26మాత్రమే చెల్లిస్తామని చెబుతున్నారని వాపోయాడు. తనకు రూ.1.75లక్షలు రావాల్సి ఉండగా.. రూ.1.15లక్షలు మాత్రమే చెల్లించారని, మిగతా రూ.65వేలు ఇవ్వడం లేదని పేర్కొన్నాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి హామీనివ్వడంతో వెనుదిరిగాడు. కాగా, ఏపీఎం విజయలక్ష్మిని సంప్రదించగా.. వీగ్రో అనే కార్పొరేట్ సంస్థతో ఒప్పందం చేసుకుని మామిడికాయలు తరలించామని తెలిపారు. నాణ్యత లేవంటూ ధరలో కోత విధిస్తున్నారని తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి ధర చెల్లిస్తామని పేర్కొన్నారు. రెండు రోజుల్లో రైతుల బకాయిలు చెల్లిస్తామని అన్నారు.

రైల్వే టీసీపై పెట్రోల్ దాడి

- పరుగులు తీసి జీఆర్‌పీ పీఎస్‌లో తలదాచుకున్న టీసీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్లో టీసీ (టికెట్ కలెక్టర్)గా పనిచేస్తున్న పీ.రాజుపై అదే స్టేషన్లో టీసీగా పనిచేస్తున్న శ్రీలత భర్త పీఎస్ రాజు సోమవారం స్థానిక రైల్వేస్టేషన్లో పెట్రోల్‌తో దాడి చేసినట్లు తెలిసింది. దాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. శ్రీలతరాజులకు టీసీ పీ.రాజు ప్లాట్ కొనిస్తానని రూ.25లక్షలు తీసుకొని, తప్పుడు ప్లాట్ కొనివ్వడంతో ఇద్దరి మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. డబ్బులు ఇవ్వాలని శ్రీలత దంపతులు అడుగుతుండగా డబ్బులు ఇవ్వనని బెదిరించడం, మరో ప్లాట్ ఇప్పిస్తానని రాజు కాలయాపన చేస్తున్నాడని బాధితులు ఆరోపించారు. రైల్వేస్టేషన్‌లో డబ్బుల విషయమై సోమవారం గొడవ రావడంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో టీసీ రాజుపై పీఎస్.రాజు దాడికి పాల్పడ్డాడు. దీంతో తప్పించుకునేందుకు టీసీ రాజు పరుగులు తీసి జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్లోకి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. టీసీ రాజు ఇచ్చిన ఫిర్యాదుతో పీఎస్ రాజుపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై జీఆర్‌పీ ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడం గమనార్హం.

మొక్కలు నాటి సంరక్షించాలి

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని శ్రీరాంపూర్ ఇంచార్జీ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఆర్పీ 1గనిపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏజెంట్ గోపాల్‌సింగ్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, గని మేనేజర్ విజయకుమార్, రక్షణ అధికారి చంద్ర ముర్మ, ఇంజనీర్లు శంకరయ్య, రాజేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య పాల్గొన్నారు.

డిపెండెంట్ల వయస్సు 40 ఏళ్లకు పెంపు

శ్రీరాంపూర్: సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలకు డిపెండెంట్ల అర్హత వయస్సును 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కారుణ్య ఉద్యోగాల్లో చాలామంది డిపెండెంట్ల వయస్సు 35 సంవత్సరాలు ఉండడం వల్ల ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని, దీనిపై కార్మికుల నుంచి పెద్దయెత్తున వినతులు, తాము యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. కారుణ్య ఉద్యోగాలు అమలైన తేదీ మార్చి 9, 2018 నుంచి అమలు ఉంటుందని, వయస్సు అర్హత లేక ఉద్యోగాలు పొందని వారు, పెండింగ్ కేసులు కూడా దీని ద్వారా పరిష్కారానికి నోచుకుంటాయని తెలిపారు.

సీఎండీకి ఏఐటీయూసీ వినతి



వినతిపత్రం ఇస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించిన క్లర్క్‌లకు ఆ రోజున ఆన్ డ్యూటీ ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం యూనియన్ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించిన రోజుకు స్పెషల్ లీవ్ ఇవ్వడం వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే ఆన్‌డ్యూటీగా పరిగణించాలని కోరారు. ఇందుకు సీఎండీ అంగీకరించినట్లు సీతారామయ్య తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



వ్యానులోని పశువులు

జైపూర్: మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల నుంచి ఎడ్లను చెన్నూర్ నుంచి శివ్వారం మీదుగా పార్వతి బ్యారేజీ నుంచి పెద్దపల్లి జిల్లాకు తరలిస్తుండగా కిష్టాపూర్ వద్ద పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి గోవధకు తరలిస్తున్నట్లు గుర్తించారు. 20పైగా ఎడ్లు ఉన్నాయి. డీసీఎం వ్యాన్‌తోపాటు ఎడ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

నేటికీ వివక్షకు గురవుతున్న మహిళలు



కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దేశానికి స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా నేటికీ మహిళలు వివక్షకు గురవుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన మండల సమావేశంలో మాట్లాడారు. మహిళలు, ఆడపిల్లలు తమ బాధలను ధైర్యంగా చెప్పుకునే అవకాశం లేక ఎంతో మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి సంకె రజిత పాల్గొన్నారు. హాజీపూర్ మండల ఐద్వా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసి ప్రకటించారు. గౌరవ అధ్యక్షురాలిగా పెంద్రం కళావతి, అధ్యక్షురాలిగా ఉగ్గె ఉమ, ప్రధాన కార్యదర్శిగా జి.మానస, ఉపాధ్యక్షురాలిగా కె.అర్చన, సహాయ కార్యదర్శిగా జి.అనిత, కమిటీ సభ్యులుగా కె.సులోచన, జి.రాజుబాయి, నయీమున్నీసా, బి.పద్మ, కె.జయశ్రీ, ఏ.స్వరూప ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో పెద్ద చెరువు సమస్య పరిష్కారం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్: గత కొంత కాలంగా పెద్ద చెరువులో చేపల వేట కోసం ముదిరాజ్, గంగపుత్రుల మధ్య కొనసాగుతున్న వివాదం ఎమ్మెల్యే వివేక్ చొరవతో పరిష్కారమైంది. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ముదిరాజ్ కులస్తులు కలిసి పెద్ద చెరువులో చేపల వేటకు సమాన హక్కు కల్పించాలని కోరారు. ఆయన మత్స్య శాఖ ఏడీని పిలిపించి మాట్లాడారు. చెరువులో చేపల వేటకు ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కావడంతో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు గిరెల్లి మల్లయ్య, చింతల శ్రీనివాస్, పాతర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చైన్‌దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన అబ్దుల్ సాజిద్, పాతూరి తరుణ్, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన బోయర్ శేఖర్, మిర్చి కాంపౌండ్‌కు చెందిన వర్మజి చంటి సాయికుమార్ కలిసి ఆర్మూర్, బాల్కొండ, మోర్తాడ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. మోర్తాడ్ మండలం దొన్కల్ 63వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు అంగీకరించారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలతోపాటు 15 తులాల 7 గ్రాముల బంగారు చైన్లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సురేశ్, నారాయణ, నవీన్‌చంద్రను ఏసీపీ అభినందించారు. సమావేశంలో భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్ విద్యార్థినికి ప్రతిభా పురస్కారం



రవీంద్రభారతిలో విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని తుమ్మల యశస్విని ప్రతిభా పురస్కారం అందుకుంది. 10 జీపీఏ సాధించిన విద్యార్థులతో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముఖాముఖిలో కార్యక్రమం నిర్వహించగా.. పాల్గొంది. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. పాఠశాల హెచ్ఎం కొమ్మెర రాధాకృష్ణమూర్తి, యశస్వినిలను నిర్వాహకులు అభినందించారు.

సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి పెంచాలి

బెల్లంపల్లి: శాంతిఖని గనికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాన్ని సమష్టి కృషితో సాధించాలని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ అన్నారు. సోమవారం శాంతిఖని గనిని జీఎం సందర్శించారు. గని అధికారులతో కలిసి భూగర్భంలో దిగి పని స్థలాలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కంపెనీ ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని అన్నారు. అధికారులు, సూపర్‌వైజర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాంతిఖని ఏజెంట్ విజయ్‌ప్రసాద్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం మనోహర్, పక్కన అధికారులు